# రాయబారాలు

"ఈ విషయంలో జోక్యం కలుగజేసుకోవడం చాలా అనవసరం...నే చేసేపని నీకు నచ్చనట్లేగా..."

ఆ విధంగా పెరిగిపోయేటప్పటికి నేను బయటికి రావలసి వచ్చింది. తలుపు ఫెడేలుమన్నది. ఛీ ఇంతకన్నా పరమ చండాలుడు ఇంకోడున్నాడా అనుకున్నాను.

రూములోవచ్చి కూచున్నాననేమాటేగాని స్థిమితం ఏదీ...ఒక్క ముక్క...చదువుతున్న పుస్తకం మూసేసి... బయటకు వచ్చాను ..

"నిన్నట్లా చిత్రవధ చేయాల్సిందే...రాకాసీ !...లేక పోతేమాట వింటావా."

చాలా కరకుగా మాట్లాడుతున్నాడు. దెబ్బలు వినబడు తున్నాయి. ఆమెకున్న సహనం, ఓర్పు ఎదటనిల్చిని ఎదుర్కు న్నట్లుగా వుంది. మరి చడీచప్పుడు లేదు...

"ఇప్పుడు మీ నాన్న దిగివస్తాడేమో చూస్తా..."

ఉహుఁ అప్పటికీ నిశ్శబ్దం— దెబ్బలుమాత్రం వినబడు తున్నాయి.

ఏమీ తోచలేదు—దగ్గరికివెళ్ళి తలుపు తట్టాను.

"ఎవరువారు...ఇప్పుడే తలుపు తియ్యరు !"

"పోస్టుమేన్ సర్ !" గొంతు మార్చాను.

ముఖాముఖి ఎదటనిల్చుని.

"నీ మతి ఇక్కడవుందా చేస్తున్న పనేవిటి....నీకు చెయ్యాన్నా నెప్పి అనిపించలేదు." కొంచెం కసిరినట్టు మాట్లాడేటప్పటికి.

"జగ్గరాజుగారూ ఈ విషయంలో మాత్రం" కొంచెం దగ్గరికివచ్చి సీదాగా ఆరంభించాడు.

ఒళ్ళు తెలీక కిందపడివున్న ఆమె మీదకు వురికి ఇంకొక దెబ్బ-

అది నా మీదకు రావటం జరిగింది.

"జగ్గరాజుగారూ మళ్ళీ చెప్తున్నాను, మీరు మటుకు ఈ విషయంలో"

అఘోరించినట్లుంది అని గుండెలదాకా చేయిపోనిచ్చి ధడక్...ధడక్ మంటుంటే చొక్కాపట్టుకుని బయటకు లాక్కువచ్చాను.

భుజంమీద పొడిచిన ఒక్క పిడికిలిపోటుకే అ...మ్మా అనుకుంటూ నీరసించి నాలుగడుగులు పక్కకు తిరిగి తాగిన వాడి మాదిరి తూలుతూ ఇంట్లో జొరపడ్డాడు. ముఖం అటు వైపు తిప్పుకుని చెమట కార్తున్న కనుబొమలు ముడిచి మంచంమీద బరువుగా వాలాడు.

చీమ చిటుక్కుమన్లేదు.

ఇంత బలహీనుడేం ?

చుట్టుపక్కలవాళ్ళు అటువైపువచ్చి కన్నెత్తి చూడ లేదు. ఆ మనకెందుకు కోలిపుండు బ్రహ్మరాతని, గప్ చిప్.

నిద్రపోతున్న ఆమె కనురెప్పలు మూసివున్న గొంతు చించుకుపోయి అది ని॥ దేనంటూవా స్పృహలేదు.

'అమ్మాయీ ?' అని నింపాదిగా పిలిచాను.

జవాబు లేదు.

వాడుమాత్రం పెడమొగంపెట్టి కళ్ళు మూద్దామా వద్దా అనే పరిస్థితుల్లో ఉన్నాడు.

కాస్సేపటికి ఆమె కళ్ళు తెరచి ఒకపొర్లు పొర్లి నరా అన్నీ తీసుకుని లేచికూచింది. తనను బాగా కొట్టాడని తెలుసునా ?

మనిషి రెల్లుపుడకలాగా మరీ వంగిపోయి నన్ను చూసి సిగ్గునభినయించి ఇదేవిటి జగ్గరాజుగారు ఇక్కడికి వచ్చారను కుందేమో వంటయింటి గుమ్మంలోకి ఒక్కపరుగున వెళ్ళబోయి ముచ్చెమటలుపోసి కుప్పగా కూలిపోయింది.

దగ్గరికి వెళ్ళనిచ్చిన పోస్టుమేన్‌వలె జరిగిన సంగతి తెలుసుగా అన్నాను.

మాట్లాడలేక నాలిక పీక్కుపోయి, దాహం అని సూచించేప్పటికి.

వాడిమాత్రం పెడమొగంపెట్టి ఆ మంచం మీదనే గుండె ఆగిపోయినవాడిమాదిరి.

నా యింట్లోకి వెళ్ళి, కూజా, చిన్న గ్లాసూ తేచ్చి ఎదట ఉంచాను. నాకింకా కోపం ఆగక ముచ్చుమాదిరి ముడుచుకు పడుకుంటే బహదూర్.

ఉహుఁ అసలు ముఖం ఇటువైపు తిప్పందే ఇంకా ఉడుకుతునేవుంది నా రక్తం.

యుద్ధభూమి మాదిరి చిందరవందరగా పడివున్న ఇల్లును

కొంచెం ఓపికతోసర్దీ నెమరేస్తున్న భారాను మ్రింగటుండా.

అతని మంచం దగ్గరకు వెళ్ళి రామలింగం! నేను వెళుతున్నాను అని చెప్పి.

'రామ్మా' చేయి ఊతం ఇచ్చి నిల్చుండేటట్టు చేసి తీసుక వెళ్ళాను.

ఇద్దరీ ఇళ్ళూ ఒకరికొకరు క్రీగంటితో చూసుకుంటాయి.

తెల్లవారితేగానీ వళ్ళు తేసుకోదు, మరి అంత పశుబలం అయితే ఎట్లా.

హోటలువాడు కారియరు తెచ్చి అక్కడ పెట్టి ఆదాబ్! అని గడపదాటాడు.

ఏమీ పరవాలేదు భోంచేయి తల్లీ ఇదిగో జగ్గరాజు చెప్తున్నాడు తినమని తినాలి. లేకపోతే బావుండదు నాకు కొంచెం కోపంవచ్చినట్టు కసురుకున్నాను.

అన్నం తినేదాకా అక్కడే కూచుని తప్పనిసరిగా ఆమె చేత మాట్లాడిద్దామని మా హోటలు భోజనం ఎలావుందీ బావుంది అనిపించుకుని.

అతనేదో చిన్నవాడు ఇంకా కుర్రతనం ఆ బిగువు పోలేదు. కానీ నసపెడ్తూండటం వాస్తవమే మనం ఎంతో గుంభనంగా వుండాలి, చలించ కూడదన్నాను నవ్వులో. మర్నాడుగూడా రామలింగంలో తేలికదనం కన్పించలేదు.

పోనీ అతనికి తిండివుందా రాత్రి నీళ్లు తాగాడా అని గానీ అతన్ని గురించిన ప్రశ్నలు నాలో కలగలేదు అదేవిటో.

అదంతా అతనిమీద నాకున్నకోపమూ అంటే నేనేం

చెప్పలేను. ఆ మర్నాడు చెప్పాను దగ్గర కూచోపెట్టుకుని నిన్ను పేరుపెట్టి పిలుస్తున్నాను అమ్మాయీ జానకీ...ఇప్పుడు వెళ్ళి కూరా అన్నం వండి, నీళ్ళు కాగబెట్టి అన్నీ అయిన తరువాత కంచములో అన్నంవుంచి...

నీవు స్వయంగా వెళ్ళి ఏవండీ అని అతని వంటిమీద చేయివేసి నిద్రలేపు ఏమన్నా అననీ ఏం వింటున్నావా.

నేను ఆఫీసుకు వెళ్ళిపోయినాను కాని రామలింగం మటుకు నామీద కోపంగా వున్నట్టు ప్రవర్తిస్తాడు నేనేం చేశానో.

ఎప్పుడో నాలుగునెల్లనాడు 'భార్య' అనే పదాన్ని అర్థం చేసుకోవాలోయ్...అన్నాను ముక్తసరిగా.

o o o o

క్రిక్కిరిసియున్న రైల్లో అందులో దక్షిణహిందూస్థానపు మూడోతరగతి రైలుపెట్టె గోల్డుఫ్లేకు సిగిరెట్టు పెదిమలకు అంటీ అంటనట్లు వెలిగించి కాస్త చోటుకోసం పక్కవాడితో బాతాఖానీ మొదలుపెట్టాను.

"ఈ ఏడు పంటలు సరిగా లేవన్నాడు పక్కవాడు" 'రోజులు ముమ్మరంగా వున్నయిలే' అని కొంచెం సావకాశంగా కూచున్నాను.

"ఏవండోయ్ జగ్గరాజుగారూ ఇక్కడున్నారేంటి"

అమాంతంవచ్చి నా బుజం లంకించుకుని ఇహిహీ అని నవ్వాడు. ఓరి నీతస్స అనుకుని "ఏవిటీ పంతులు విశేషం కులాసా..." కుశల ప్రశ్నలు వేసింతరువాత నాకు నాల్గునెల్లక్రితమే ట్రాన్స్ఫరు అయిందని శ్రీకాకుళంలో వుంటున్నానని చెప్పేను. డేగల్లె అంతెత్తు ఎగిరి 'మాతో ఆ మాత్రం చెప్ప కూడదండీ' మళ్ళీ ఇహిహీలని పిచ్చినవ్వు నవ్వాడు.

"సిగిరెట్టు ముట్టించవోయ్" పెట్టెముందర వుంచాను.

"వద్దండీ జగ్గరాజుగారూ..."

కాల్చమని కసిరేటప్పటికి నవ్వులో ఒకటి ముట్టించి పొగవదల్తూ.

జగ్గరాజుగారూ దాన్నితీసుకురాను వెళ్తున్నాను. ఉత్తరంరాసింది. వాళ్ళ నాన్నకు జబ్బుగా వుందని ఒంటరిగా రాలేనని."

"అమ్మాయి కులాసా-"

"కులాసాగానేవుంది పాపం ఈ మధ్య వాళ్ళ తమ్ముడికి జబ్బుగావుందంటే.

నెలైంది తనే వుత్తరం రాసింది రమ్మనమని" ఇదిగో ఈ కమలాఫలం వలుస్తాను. ఒకటి నోట్లోవేసుకో పులుపులేదులే అని అందించి ఇహకానీయ్ అన్నాను.

"జగ్గరాజుగారూ మీరు మా యింటికి రావాలిశలవలకు అప్పటికి అది వస్తుంది రెండుపూట లుండిపోవాలి."

"దానికేం లేలోయ్ ఈ పేపరు చూశావ్ గాంధీగారికి కొంచెం అస్వస్థతగా వుందట."

చదువుతున్న పేపరు అతని మొగానికి అడ్డపెట్టి... మరో సిగిరెట్టు వెలిగించాను.

"ఏమిటో చెప్పాననిగాదు తప్పక రావాలి నాకు పిలవడం అంతకన్న చేతగాదులెండి" నా బుజం కదిపి 'ఏవండీ' అని పేపరు మళ్ళీ నాకిచ్చేశాడు.

"నీకేమన్నా ప్రమోషను వచ్చిందా రామలింగం" అంటే 'నా జీవితంలో ప్రమోషను వచ్చింది' అన్నాడు తమాషాగా.

నా చిరునామా అడిగితే జాగ్రఫీ మాష్టరు, శ్రీకాకుళం అంటే వస్తుందన్నాను.

రైలు ఆగింది. తను స్టేషనులో దిగి ప్లాటుఫారంమీద రైలు పోయేదాకావుండి డిశంబరు శలవలకు ఉత్తరం వేస్తానని చెప్పి వస్తానండీ జగ్గరాజుగారూ రైలు కదిలింది ప్లాటుఫారం వెనక్కి పోతువన్నది.

నా పక్కనున్నవాడు "వేరుశనగధర పడిపోయిందండీ" అన్నాడు.

కథాంజలి

)-o-(